# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కృష్ణా నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

2. **యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో నిషేధిత జాబితాలో ఉన్న 22-ఏ భూముల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

4. **తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన మొదటి దశ నోటిఫికేషన్ ఈరోజు విడుదల కానుంది.**

5. **ఆంధ్రప్రదేశ్ లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు.**

===========================

కృష్ణా నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో మొత్తం 811 టీఎంసీల వాటా ఉండగా, రాష్ట్ర విభజన అనంతరం కృష్ణా నదీ జల వివాదాల ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చొప్పన జలాలు కేటాయించిందన్నారు. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా జలాల కేటాయింపులను పునఃసమీక్షించాలనడం సరికాదని తెలిపారు.

--------------------------

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటు చేసిన ఉద్యోగమేళాను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. యువత ఉద్యోగానికి తగిన వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో నిషేధిత జాబితాలో ఉన్న 22–ఏ భూముల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరులోని కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో నిన్న పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 16న జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---

రాజధాని అమరావతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ విస్తరణ పనులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు భూమిపూజ చేస్తారు. 260 కోట్ల రూపాయలతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ పనులను చేపట్టనుంది. మొదటి దశలో 140 కోట్లు వ్యయంతో వివిధ పనులతో పాటు 92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మించనున్నారు. అలాగే 120 కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు–సిబ్బంది నివాస గృహాలు, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని అధికారులు తెలిపారు.

---

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై తిరుమలలో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

---

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన మొదటి దశకు ఈరోజు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈరోజు నుంచి ఈ నెల 29 వరకు నామినేషన్ల స్వీకరణ నవంబర్ 30న నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. డిసెంబర్ 11న పోలింగ్ జరుగనుంది. ఈరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలింగ్ ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సంబంధిత అధికారులతో నిన్న హైదరాబాద్ నుంచి దృశ్య మాధ్యమ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు.

---

ఆంధ్రప్రదేశ్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సహకారంతో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర దత్తత వనరుల అథారిటీ ఈరోజు విశాఖపట్నంలో జాతీయ దత్తత అవగాహన సమావేశం–2025ను నిర్వహిస్తోంది. ఈ సమావేశంలో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ మాలిక్,

ఆంధ్రప్రదేశ్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎ.సూర్యకుమారి, కేంద్ర దత్తత వనరుల అథారిటీ కార్యదర్శి భావన సక్సేనాతో సహా పలువురు అధికారులు, ప్రముఖులు పాల్గొంటారు. జాతీయ దత్తత అవగాహన మాసంలో భాగంగా "ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు సంస్థేతర పునరావాసం" అనే అంశంపై సమావేశంలో చర్చిస్తారు. అలాగే "అడాప్టింగ్ చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్" అనే ప్రత్యేక చిత్రాన్ని విడుదల చేస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. వైయస్సార్ కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులలోని బ్రాహ్మణపల్లెలో అరటి పంటను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్.. 31 సెకన్లు

---------------------------

గోవాలోని పణాజీలో జరుగుతున్న 56వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం – ఇఫీ ముగింపు దశకు చేరుకుంది. ఈ ఉత్సవంలో ఏడవ రోజైన నిన్న పలు చిత్రాల ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, చిత్రనిర్మాతలతో ప్రత్యేక సంభాషణలు జరిగాయి. చలనచిత్ర ప్రదర్శనలలో, హేషమ్ ఫరాహ్మండ్ దర్శకత్వం వహించిన ఇరానియన్ చిత్రం, "మై డాటర్స్ హెయిర్"ను ప్రదర్శించారు. అలాగే రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 1990 నాటి తెలుగు చిత్రం "శివ", మోహన్‌లాల్ నటించిన 1989 నాటి చిత్రం "కిరిధమ్"లను ప్రదర్శించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో క్రీడల అభివృద్ధికి సహకారం అందించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కోరినట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కర్నూలు జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో గుర్తించిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ ఈరోజు వాయుగుండంగా బలపడే అవకాశముందని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో చలి తీవ్రత కొనసాగుతోంది. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో 14.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే తెలంగాణాలోని మెదక్‌లో 13.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

=====================